క్లుప్తంగా

అధినేతతో నేదురుమల్లి



వెంకటగిరి (సైదాపురం): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం రాత్రి కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని అధినేత సూచించినట్లు నేదురుమల్లి తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల వినతి



వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

సూళ్లూరుపేట : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందిన సచివాలయ సిబ్బందిని ఈ కూటమి ప్రభుత్వం వేధిస్తోందంటూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డికి తిరుపతి జిల్లా సచివాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ టీ రాజశేఖర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఏర్పాట్లు చేసిన వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి వాళ్ల చేసే పనులన్నింటిని తమ చేత చేయించడం దారుణమని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులకు వలంటీర్ల విధులు అప్పగించవద్దని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందిస్తున్న సురేంద్రరెడ్డి

చిల్లకూరు: గూడూరు పట్టణానికి చెందిన ఓ పేద విద్యార్థినికి శుక్రవారం ల్యాప్‌టాప్ వితరణ చేశారు. రొటేరియన్ పాస్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణానికి చెందిన యశస్విని నెల్లూరులో సీఎంఏ (కాస్ట్ మేనేజ్‌మెంట్) కోర్సులో మంచి ప్రతిభ కనబరుస్తున్న ఆమెకు ల్యాప్‌టాప్ అవసరమైంది. దీంతో ఆమె దాతల సహకారం కోరింది. బాపట్లలో 1989లో ఇంజినీరింగ్ చదువుతూ అందరి కోసం అనే సంస్థను ఏర్పాటు చేసిన పూర్వపు విద్యార్థులు బాలికకు ఆర్థిక సాయం చేశారు. ఆ సాయంతో బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందించారు.

నూతన దుస్తుల పంపిణీ



నూతన దుస్తులు అందజేస్తున్న చెన్నారెడ్డి బాబురెడ్డి

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చెన్నారెడ్డి బాబురెడ్డి శుక్రవారం పేదలకు అన్నదానం, నూతన దుస్తులు పంపిణీ చేశారు. విజయ దశమి సందర్భంగా తమ తల్లి చెన్నారెడ్డి సుశీలమ్మ జ్ఞాపకార్థం గత 25 ఏళ్లగా నూతన దుస్తులు అందజేస్తూ, గ్రామ శక్తి దేశమ్మ ఆలయంలో అన్నదానం చేస్తున్నట్లు బాబురెడ్డి తెలిపారు. తమ కున్న దాంట్లో పేదలకు తమ వంతు సాయం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు.

ఇళ్లలోకి పాములు

రాపూరు: మండలంలోని తూమయి గ్రామ సమీపంలోకి కండలేరు జలాశయం నీళ్లు రావడంతో గ్రామస్తుల ఇళ్లలోకి పాములు వస్తున్నాయని గ్రామ సర్పంచ్ చంద్రమోహన్ తెలిపారు. కండలేరు జలాశయంలో సుమారు 58 టీఎంసీల నీరు నిల్వచేయడంతో సమీపంలో ఉన్న తూమాయి గ్రామంలోని నివాసాలకు పాములు, విషపురుగులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. తన ఇంటి సమీపంలో శుక్రవారం సుమారు 10 పాములు రాగా అందులో 4 పాములను చంపేసినట్లు తెలిపారు. ఇటీవల స్థానికుడు ప్రభాకర్ పాముకాటుకు గురై చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. తెలుగుగంగ ఉన్నతాధికారులు తమ గ్రామాన్ని కూడా ముంపు గ్రామంగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

నేడు మండల సమావేశం

సైదాపురం : మండల కేంద్రంలో ఎంపీపీ పెంచలమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

చికెన్ ధరలు		4-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	133
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	238
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	262
లేయర్ చికెన్	:	187

గగనం.. గ్రామీణ వైద్యం!

- సమ్మెలో గ్రామీణ పీహెచ్‌సీ వైద్యులు
- వైద్యుల సర్దుబాటులో అధికారులు
- పలుచోట్ల విధులకు హాజరుకాని వైద్యులు
- సేవల కోసం రోగులు తిప్పలు



సైదాపురం పీహెచ్‌సీలో ఖాళీగా దర్శన మిస్తున్న వైద్యుడి సీటు



వైద్యులు లేకపోవడంతో నిర్మానుష్యంగా మారిన సైదాపురం పీహెచ్‌సీ

వెంకటగిరి(సైదాపురం): పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో గ్రామీణులకు వైద్యం అందడం లేదు. ఓపీ విధులు, స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ వైద్యశిబిరాలకు దూరంగా ఉన్న వైద్యులు అత్యవసర సేవలు కూడా బహిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పలు పీహెచ్‌సీల్లో వైద్యులను సర్దుబాటు చేసినా పలుచోట్ల వైద్య సేవలు అందక నిరుపేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వెంకటగిరి నియోజక వర్గంలోని డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల్లో వైద్యులు విధులను బహిష్కరించడంతో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ అస్పత్రులకు వైద్యులను కొంత మేరకే సర్దుబాటు చేశారు. వీరిలో బంగారుపేట వైద్యశాలకు తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి డాక్టర్ మధుసూదన్ సేవలు అందిస్తున్నారు. కలువాయిలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న విజయలక్ష్మి సమ్మెలో ఉండడంతో జీజీహెచ్ నుంచి ప్రత్యామ్నాయంగా డాక్టర్ దినేష్‌ను నియమించి సేవలను అందిస్తున్నారు. కుల్లూరు పీహెచ్‌సీలో ప్రత్యామ్నాయ వైద్యులను నియమించకపోవడంతో ఆస్పత్రిలోని డాక్టర్లు గదులకు తాళాలు వేశారు. దీంతో రోగులు ఇక్కట్లు పడ్డారు. సైదాపురంలోని పీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు వైద్యులు సమ్మెలో ఉండడంతో ఆ గదులకు కూడా తాళాలు వేసి ఉన్నాయి. దీంతో వైద్యశాలల్లో నర్సులు వైద్యులుగా సేవలను అందిస్తున్నారు. డక్కిలిలో ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఇద్దరు వైద్యులు సమ్మెలో ఉండడంతో ప్రత్యామ్నాయంగా నాయుడుపేట నుంచి పీజీ డాక్టర్ వచ్చి రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు. రాపూరు మండలంలోని వేపినాపి వైద్యశాలలో ఇద్దరు వైద్యులు సమ్మెలో ఉండడంతో ఉన్నతాధికారులు డాక్టర్ నాయక్‌ను నియమించి సేవలు అందిస్తున్నారు.

రోగుల ఇక్కట్లు

నియోజకవర్గంలోని పలు ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సీహెచ్‌సీ, పీహెచ్‌సీలో రోజువారి ఓపీ 100 నుంచి 250కు పైగా ఉంటుంది. వీటిలో జనరల్ కేసులు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా జనరల్ కేసులు ఎక్కువగా ఎంబీబీఎస్ వైద్యులు చూస్తుంటారు. కొన్ని వైద్య శాలలకు ఇన్‌చార్జీలుగా నియమించిన సరైన వైద్యం అందడం లేదు. మరో పక్క కొన్ని చోట్ల ఇన్‌చార్జీలు విధుల్లో చేరకపోవడంతో పీహెచ్‌సీలో వైద్యులు లేక రోగులకు అవస్థలు తప్పడం లేదు. రూరల్ పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లపై ప్రభుత్వం ఇంకా సానుకూలంగా స్పందించకపోవడంతో ఆందోళన ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియని పరిస్థితి. అప్పటి వరకు వైద్య సేవల కో సం పేదలకు ఇబ్బందులు తప్పవని రోగులు వా పోతున్నారు. త్వరితగతిన సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.





సైదాపురం పీహెచ్‌సీలో మరో వైద్యురాలు గదికి తాళం వేసి ఉన్న దృశ్యం, కుల్లూరు పీహెచ్‌సీలో మూతపడి ఉన్న వైద్యుడి గది



డక్కిలిలో సేవలందిస్తున్న తాత్కాలిక వైద్యుడు



బంగారుపేటలో రోగులకు సేవలందిస్తున్న ప్రత్యామ్నాయ వైద్యుడు

ఎంపీ మిథున్‌రెడ్డితో ఎస్‌ఈసీ సభ్యుడు



ఎంపీ మిథున్‌రెడ్డితో కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్‌ఈసీ (స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) మెంబర్ కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. మద్యం కేసులో అక్రమగా అరెస్టయి విడుదలైన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

నేడు సర్వసభ్య సమావేశం

కోట: మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దిలీప్‌కుమార్ తెలిపారు. అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహణపై శుక్రవారం సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు.

పట్టణాభివృద్ధికి నిధులు విడుదల

చిల్లకూరు: గూడూరు మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు నిధులు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన తెలిపారు. పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌తో కలసి ఆయన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేసిన గూడూరు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరం, ఇంజినీరింగ్ విభాగ కార్యాలయ గదులను ఆరంభించారు. మున్సిపల్ సిబ్బందికి కానుకను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

నాయుడుపేటటౌన్: పట్టణంలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో గురువారం రాత్రి పాత్రికేయుడు మద్దాలి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, లక్ష్మీ మౌనిక వివాహ వేడుకల్లో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. నూతన వధూవరులకు ఆశీర్వాదాలు అందించారు. సంజీవయ్యతో పాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఓట్టూరు కిషోర్ యాదవ్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకం జయరామయ్య, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డి, గంధవల్లి సిద్దయ్య పాల్గొన్నారు.

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దగ్గవోలు సురేంద్రబాబు కుమారుడు వంశీక్రిష్ణ, విష్ణు ప్రియ వివాహానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. షిర్డీ సాయినగర్‌లో ఉన్న సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో జరిగిన వివాహానికి హాజరైన సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కొడవలూరు భక్తవత్సలరెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, నాశిన నాగులు, బత్తిన విజయకుమార్ వధూవరులను ఆశీర్వదించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చిల్లకూరు: గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు స్థానికంగా ఉండి అర్హత ఉన్న మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ మఠం, మండలంలోని పల్లమాల గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు జనరల్ కేటగిరిలో మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హెల్పర్ పోస్టులకు సంబంధించి చెన్నూరు బైపాస్ ఎస్టీ కేటగిరి, గూడూరు ఆర్టీసీ బస్టాండ్ బీసీ–బీ, చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం(విలేజ్) జనరల్, బీసీ–బీ, వడ్డి కండ్రిగ, జనరల్ బీసీ–ఏ , గూడూరు రూర ల్‌లో చెన్నూరు, హెచ్‌డబ్ల్యూ–1 ఎస్సీ, గ్రూప్–3కి సంబంధించి అర్హులైన అభ్యర్థులు పదవ తరగతి పాస్ అయ్యి ఉండి 21 నుంచి 35 ఏళ్లలోపు వారు ఈ నెల 15లోగా దరఖాస్తులను తమ కార్యాలయంలో అందించాలని కోరారు. నియామక దరఖాస్తు ఖర్చు నిమిత్తం రూ.50 చెల్లించాలన్నారు.

గ్రామ సభలు భలే హాట్ గురూ..



తలపై తువ్వాలు వేసుకుని గ్రామ సభలో పాల్గొన్న ఉపాధి కూలీలు

చిల్లకూరు: మండలంలోని తొణుకుమాల గ్రామంలో గ్రామ సర్పంచ్ త్రివిక్రమ భూపతి ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభ మాత్రం చాలా హాట్(వేడి)గా కనిపించింది. పైన ఎండ తీవ్రత, కింద కాలిపోతుంటే ఎర్రటి ఎండలో గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి కూలీలు ఎండకు తట్టుకోలేక అవస్థలు పడ్డారు. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే క్రమంలో ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు, పనులు ఎలా ఖర్చు చేయడం వంటి విషయాలపై గాంధీ జయంతి రోజున అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఆ రోజు సెలవు కావడంతో శుక్రవారం ఈ సభలు మండు టెండలో నిర్వహించారు. నీడ కల్పించకపోవడంతో కూలీలు అవస్థలు పడ్డారు.

వైఎస్సార్ సీపీ ఎస్‌ఈసీ సభ్యుల నియామకం



కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి



బొలిగర్ల మస్తాన్‌యాదవ్



పాపకన్ను మధుసూదన్



ఎల్లసిరి గోపాల్‌రెడ్డి



పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి



వి.కుమార స్వామిరెడ్డి

వెంకటగిరి రూరల్/చిల్లకూరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌ఈసీ (స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) సభ్యులు నియమితులయ్యారు. వెంకటగిరికి చెందిన కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల మస్తాన్‌యాదవ్, రాపూరు మండలానికి చెందిన పాపకన్ను మధుసూదన్, గూడూరు పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోట మండలం అల్లంపాడు గ్రామానికి చెందిన పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డిని, చిల్లకూరు మండలం మోమిడి గ్రామానికి చెందిన వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన కొడవలూరు భక్త వత్సలరెడ్డిని కేంద్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యులుగా నియమించారు.

అమ్మవార్లకు వైభవంగా గ్రామోత్సవాలు

చిల్లకూరు: దేవీ నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అమ్మవారి ఆలయాలకు చెందిన నిర్వాహకులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. తీర ప్రాంతంలోని తూర్పుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు సింహ వాహనంపై ఊరేగారు. గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో వెలసిన మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ నిర్వాహకులు అమ్మవారి భారీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాముల పార్కు సమీపంలోని దళితవాడలో వెలసిన మహాలక్ష్మీ ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేక వాహనంలో పట్టణంలోని హిజ్రాలు ఊరేగించారు. అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.



చిల్లకూరు: సొసైటీ ప్రాంతంలోని మహాలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం

ఎల్లమ్మకు గ్రామస్తుల పొంగళ్లు

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు గ్రామ దేవత శ్రీ ఎల్లమ్మ తల్లికి విజయ దశమి సందర్భంగా గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి విశేష పూల అంకరణ చేశారు. రాత్రి అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజ చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేష అలంకరణ గావించి పల్లకీ సేవ చేశారు.

కండలేరులో 57.9 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 57.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 160, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి పుష్పయాగం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం స్వామివార్లకు పుష్పయాగ పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, శాస్త్రోక్తంగా పుష్పయాగం నిర్వహించారు. ముందుగా పుష్పయాగం కోసం తీసుకొచ్చిన పూలతో భక్తులతో పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు వచ్చి ఆలయం వద్ద ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. రాత్రి స్వామి వార్లకు ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు.



వెంకటేశ్వర స్వామి వార్ల చక్రస్నానం

వేడుకగా చక్రస్నాన పూజలు

గురువారం వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం వద్ద మహా పూర్ణాహుతి, వసంతోత్సవాల అనంతరం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కోనేరు(పుష్కరిణి)లో చక్రస్నానం చేశారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తం



అశ్వవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని ఆదిలక్ష్మీదేవి శరన్నరాత్రి మహోత్సవాలు విజయ దశమితో పరిపూర్ణమయ్యాయి. గురువారం ఉదయం 9 గంటలకు స్వామి వారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని అశ్వవాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాభరణాలు అలంకరించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో పార్వేటకు స్వామి వారు తరలివెళ్లారు. అక్కడ ఉంచిన జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మండలంలోని గోనుపల్లిలో శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామిని అశ్వవాహనంపై కొలువు తీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి తిరుపతి రూరల్ తోటపల్లి వాస్తవ్యులు కీర్తిశేషులు సమయం విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త సమయం చిన్నరాఘవయ్య, రూ.1లక్ష నగదును గురువారం అందించినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. నెల్లూరుకు చెందిన కొ్రపాటి వేణుగోపాల్, సాయిరోహిత్ రూ.50 వేలు నిత్యాన్నదాన పథకానికి విరాళంగా అందించినట్లు ఏసీ వివరించారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

నాయుడుపేటటౌన్: విజయదశమి వేడుకలను గురువారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఇంట్లోని విలువైన వస్తువులతో పాటు వాహనాలకు పూజలు చేశారు. పట్టణంలోని దుకాణాలు, పరిశ్రమల వద్ద, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పూజలు చేశారు.

సాయి బాబాకు వెండి దండ

చిల్లకూరు: గూడూరు సమీపంలోని షిర్డి సాయి నగర్‌లో వెలసిన సాయి బాబాకు గురువారం వెండి పూలదండను బహూకరించారు. ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు దంపతులు బాబాకు సుమారు 1.5 కిలోల వెండి పూలమాలను అందించారు.

సాయినాథునికి క్షీరాభిషేకం



సాయినాథునికి పాలాభిషేకం చేస్తున్న మందిర నిర్మాణ కర్తలు శోభారాణి, సునారెడ్డి

ఓజిలి: విజయదశమి సందర్భంగా మానమాల గ్రామంలోని బాబా మందిరంలో భక్తులు సాయినాథునికి పాలాభిషేకం చేశారు. సాయినాథుని విశేషంగా పూలతో అలంకరించారు. మందిర నిర్మాణకర్తలు కట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిసుజనా రెడ్డి, ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి 550 మందికి అన్నదానం చేశారు. రాత్రి బాబా పల్లకీసేవ నిర్వహించారు.

వైభవంగా అమ్మవార్ల నగరోత్సవాలు



దుర్గామల్లేశ్వరి దేవిగా మూకాంబిక అమ్మవారు

నాయుడుపేట టౌన్: దేవి నవరాత్రుల ఉత్సవాల పురస్కరించుకుని ముగింపు రోజున మూకాంబికా దేవి, దుర్గ మల్లేశ్వరి దేవిల నగరోత్సవం వైభవంగా జరిపారు. ఆలయాల్లో అమ్మవార్లు గురువారం రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

మున్సిపల్ కార్మికులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తంబిరెడ్డి మధుసూధన్‌రెడ్డి గురువారం దుస్తులు పంపిణీ చేశారు. పట్టణంలో లోతువాని గుంట కాలనీ వద్ద ఉన్న ఆయన తోట పట్టణంలో పనిచేసే కార్మికులకు దుస్తులను అందించారు.



మున్సిపల్ కార్మికులకు దుస్తులు అందిస్తున్న తంబిరెడ్డి మధుసూదన్ రెడ్డి తదితరులు

తూతూమంత్రంగా సీళ్లు

గాంధీ జయంతి సందర్భంగా గురువారం నాయుడుపేట పట్టణంలోని బ్రాందీ షాపులకు ఎక్సైజ్ అధికారులు తూతూ మంత్రంగానే సీళ్లు వేశారు. అయితే దుకాణాల్లో ఉన్న మద్యం పక్క దుకాణాలకు మార్చుకుని అధిక ధరలకు విక్రయాలు జరిపారు. పట్టణంలో మద్యం షాపులవద్ద విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



నాయుడుపేట పట్టణంలో బ్రాందీ షాపు పక్కనే విక్రయిస్తున్న మద్యం

వైభవం.. గ్రామోత్సవం

రాపూరు: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గత 11 రోజులుగా నిర్వహించిన శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్యకపరమేశ్వరిదేవి గ్రామోత్సవాన్ని ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో కొలువు తీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణతో పురవీధుల్లో అమ్మవారి ఉత్సవం కనులపండుగా నిర్వహించారు.

జాతిపితకు ఘన నివాళి

వెంకటగిరి రూరల్: పట్టణంలోని గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, విబ్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశుధ్య కార్మికులను శాలువ, పూలమాలతో సత్కరించారు.

గాంధీజీకి ఘనంగా నివాళి

నాయుడుపేటటౌన్: పూజ్య బాపూజీ ఆశయాలకు జీవం పోద్దామంటూ ప్రజా ప్రతినిధులు, నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని గాంధి పార్కులో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు, మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ కటకం దీపిక సారధ్యంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా గాంధీజీకి నివాళులర్పించారు.